("విజయ" మాసపత్రిక; జూన్ 1979)

థాంక్స్ టు రాఘవరావ్

సాయంకాలం ఆరుదాకా చూశాడు రాఘవరావు.

విశ్వనాథం రాలేదు.

బుర్ర కాకెక్కిపోతోంది— నిరీక్షణతో అలిసి.

"నేనెల్లుండి వెళ్ళిపోతున్నాను!" అన్నాడు నిన్న, ఆఫీస్కొచ్చి.

ఢిల్లీలో వుంటున్నాడు. కలుసుకుని పదేళ్ళయింది. నిన్న అతను ఆఫీసుకి రాగానే పాతజ్ఞాపకాలన్నీ ఒంపుకుందికి సిద్ధమైపోయాడు రాఘవరావు. "అయితే పద, మా ఇంటికి పోయి కబుర్లు చెప్పుకుందాం" అని ఆఫీసుకి "తుమ్మా" కొట్టెయ్యడానికి సిద్ధపడ్డాడు....

"అది కాదు. ఇప్పుడు నేను అర్జంటుగా మా అన్నయ్య దగ్గరికెళ్ళిపోవాలి. ఇవ్వాళంతా మా అన్నయ్యతో గడపాలి. రేపు పూర్తిగా తీరిక చేసుకుని నీతో గడపడానికి వొస్తాను. మనం ఎక్కడెక్కడికో తిరగాలి. మీ యింట్లో కూచోడం కాదు. మనిద్దరం కలిసి కొంతమందిని కలవాలి. రేపు సెలవు పెట్టి నువ్వింటి దగ్గరుండు. నేను ఉదయం ఎనిమిదిన్నరకి వస్తాను. మీ ఆవిణ్ణి వోసారి పలకరించి నిన్ను బైటికి లాక్కెడతాను. మనం మధ్యాహ్నందాకా యెక్కడో తిరిగి. భోజనం కూడా ఎక్కడో కానిచ్చేసి మళ్ళా సాయంకాలం దాకా తిరిగి, వీలుంటే యేదన్నా తెలుగు సినిమా చూసి, రాత్రి భోజనానికి మీ యింటికొద్దాం. భోజనం అయ్యాక నేను మా అన్నయ్యగారింటికి వెళ్ళిపోతాను. ఎల్లుండి వెళ్ళిపోతాను ఢిల్లీకి" అదీ విశ్వనాథం నిర్ణయం.

"ఊళ్ళో తిరగడమే అయితే సెలవు పెట్టక్కర్లేదు. బోలెడుచోట్ల చెకింగులున్నాయి. అలా అలా మనం ఎటువెళితే అటు మన స్పాట్సు చూసుకొని ఆటోగ్రాపులు పెట్టేసి డ్యూటీ చేసినట్టు నటిద్దాం" అని రాఘవరావు చెబితే—

"నో- సెలవే పెట్టు!" అని కూడా విశ్వనాథం నిర్ణయించేడు.

ఉదయం ఎనిమిదిన్నరకి వస్తానన్న మనిషికోసం, ఆరున్నరకి నిద్రలేచిన దగ్గర్నుంచీ అదిగో వస్తాడదుగో వస్తా డని వెయిటింగ్!

పన్నెండు గంటలపాటు అంతులేని నిరీక్షణ!

తన యింట్లోనే తనున్నాడు. అయితే మాత్రం? ఔట్ డోర్ డ్యూటీమీద రోజుకి ముప్ఫయి కిలోమీటర్లు తిరిగే కాలు: ముప్ఫయి మందిని తిట్టేనోరు- రెండూ కట్టడిపోయి మహా బోర్‌గా వుంది.

ఈ మహానుభావుడు రేపు వెళ్ళిపోతాడు.

"నువ్వు తొమ్మిదిదాకా రాకపోతే మీ అన్నయ్యగారింటికి ఫోన్ చేస్తా" నన్నాడు రాఘవరావు. "అలాంటి పిచ్చిపన్లు చెయ్యకు. నీతో ఒకరోజంతా గడుపుతున్నానని తెలిస్తే మా అన్నయ్య వూరుకోడు" అని హెచ్చరించేడు విశ్వనాథం.

ఇంక తప్పదు- ఫోన్ చెయ్యవలసిందే!

మేడమీది వాటా వాళ్ళకుంది, టెలిఫోను. పాపం! మంచివాళ్ళు. అర్ధ రాత్రి అయినా సరే: అవసరం వచ్చిందంటేనూ. అట్నుంచి ఫోను వచ్చిం దంటేనూ, ఏమీ విసుక్కోకుండా; ఆనందం మాదే అన్నట్టుగా వాడనిస్తారు; కబురూ చేస్తారు.

పి. అండ్. టి. కంపెనీ జెనరల్ మేనేజరు-3758. ఊహూఁ ఇంట్లో నెంబరు కావాలి. జనరల్ మేనేజరు-ఇదేమిటి, కృష్ణన్ అని వుంది? అవు నవును- విశ్వనాథం అన్నయ్యగారి పేరు లోకేశ్వరరావు, ఆర్. ఎల్. రావు అంటారు. ఆయన ఈ కంపెనీకి జి. ఎం. గా ఈ వూరొచ్చి రెండు నెలలే అయింది. డైరెక్టరీ ఆర్నెల్ల కిందట అచ్చైంది. అంచేత ఫోన్ కృష్ణన్‌గారి పేరిట వుంది—2255.

"హలో!"

"2255."

"ఆర్. ఎల్. రావుగారున్నారా అండీ?"

"మాట్లాడుతున్నాను!"

"నా పేరు రాఘవరావు సార్! నేను మీ తమ్ముడు విశ్వనాథం క్లాస్మేట్ని, ఫ్రెండుని కూడా."

"విన్నాను మీ గురించి, మీరు మంచి ఫోటోగ్రాఫర్ కదూ?"

"హాబీగా ఫోటోలు తీస్తానంతేనండి. సరే-విశ్వనాథం. నేనూ కలుసు కుని పదేళ్ళు దాటింది. నిన్న అతను నా దగ్గిరకొచ్చి, ఇవాళంతా నాతో గడుపు

తానని, శలవు పెట్టి ఇంటి దగ్గరే వుండమనీ. రేపు వెళ్ళిపోతున్నాననీ చెప్పాడు. ఇవాళ పొద్దుట ఎనిమిదిన్నరకి వస్తానన్నాడు. ఇప్పుడు సాయంకాలం ఆరు దాటింది.... హెల్ ఆఫ్ వెయిటింగ్! అంచేత కబురు తెలుస్తుందని మీకు రింగ్ చేశాన్సార్!"

"అయామ్ సారీ! విన్ను-అదే మా తమ్ముడు-కంపెనీ కారు తీసుకొని, మా పి.ఆర్.ఓ.ని కూడా తీసుకుని, పొద్దున ఏడున్నరకి కుటుంబంతో సహా బయల్దేరి వెళ్ళాడు. ఇంతవరకు రాలేదు. మధ్యాహ్నం త్రీ థర్టీకి ఫోన్ చేశాడు. అందరూ ఎక్కడో డిన్నర్‌కి సెట్ అయిపోయారట. ఎనిమిదిన్నరకొస్తారట ఇంటికి."

"అరెరె! మరెలాగండి? అతన్ని కలవాలే? రేపు వెళ్ళిపోతాడు కాబోలు! తను ఏ బండికి వెడతాడో చెబితే ట్రెయిన్ దగ్గరైనా కలుస్తాను!"

"నో-అతను రేపు వెళ్ళిపోవడంలేదు. ఎనీవే-మీ ఫోన్ నెంబరు చెప్పండి. తను రాగానే ఫోన్ చెయ్యమని చెబుతాను."

"మాకు ఫోన్ లేదండి. ఇది మా కో-టెనెంటు గారి ఫోన్. ఆ(, ఆ(-పిలుస్తారండి. నెంబరు 4150."

"జస్టు ఎ సెకండ్, కాగితం పెన్సిల్ పికప్ చేస్తానుండండి!"

"అక్కర్లేదు సార్! ఇది మీ పేరు మీదుగా వున్న ఫోనండి, అంటే-ఆర్. ఎల్. రావు అనే పేరిట వుంది ఇది. ఆయన పేరు ఆర్. లక్ష్మణరావు గారండి. ఆర్. ఎల్. రావు అన్న పేరు మీరు మర్చిపోరు కదా! డైరక్టరీలో ఆ పేరు వెతికితే చాలు."

"ఐసీ-గుడ్ జోక్! సర్లెండి."

"థాంక్యూ సర్!"

* * *

ఐదురోజుల బిజినెస్ ట్రిప్పు ముగించుకుని అప్పుడే ఇల్లు చేరాడు ఆంజనేయులు. నిన్న విజయవాడనుంచి ఫోన్ చేశాడు భార్య జమునాబాయికి. మనసంతా పెంపుడు కూతురు మాలతి మీదనే వుంది. నిన్న సాయంకాలం ఇక్కడ మాలతి పాట కచేరీ వుంది. ఆ సభకి ఆర్. ఎల్. రావుగారు ముఖ్య అతిథిగా వస్తున్నారు. ఆయన ఎంత పెద్ద అధికారో, అంతకన్నా అధికుడయిన కళా ప్రియుడు. (సౌందర్య ప్రియుడని కూడా వినికిడి).

పి. అండ్. టి. కంపెనీతో తన బిజినెస్ చాలాకాలం మూడు పువ్వులు

ఆరు కాయలుగా ఉండేది. రావుగారికన్నా ముందు కృష్ణన్ జనరల్ మేనేజర్‌గా వున్న కాలంలో తన వ్యాపార ప్రత్యర్థి పంచాపకేశన్ అరవంలో మాట్లాడి ఆయ మాయ గారడీ చేసేసి తన బిజినెస్సంతా లాగేసుకుని తన నోట మట్టి కరిపించాడు.

పాటకచ్చేరికి ఆర్. ఎల్. రావుగారు ఛీఫ్ గెస్టుగా రావడం తన బిజినెస్‌కి టర్నింగ్ పాయింటు కావచ్చు. ఎందుకంటే, కళాకారిణికి ముఖ్య అతిథితో రెపొర్టు ఉంటుంది. ఆ రెపొర్టు సహాయం దొరక బుచ్చుకుని ఆర్.ఎల్. రావుగార్ని ఓసారి ఫామిలీతో సహా "టీ"కి ఇన్‌వైట్ చేసి ఎలాగో ఒకలాగ పి. అండ్. టి కంపెనీలో కను పోగొట్టుకున్న బిజినెస్‌ని తిరిగి సాధించాలి. దీనికి పునాది వెయ్యవలసింది అత్యంత సౌందర్యవతి, పూర్ణయవ్వనవతి అయిన తన పెంపుడు కూతురు మాలతే.

ఒకప్పుడయితే యిలాంటి కార్యాలు తన "భార్య" జమునాబాయి అవలీలగా చేసేదే. కాని యిప్పుడు జమునాబాయి యుగం అంతరించింది. మంచి గౌరవతో, ఆర్.ఎల్. రావుగారి కళాప్రియత్వంపట్ల తగుమాత్రం ముఖస్తుతితో, ఆ ప్రోగ్రాం ముందూ వెనకా మాలతి ఆయనతో ఎలా ఎలా ఏమిటేమిటి మాట్లాడాలి, ఎన్నిసార్లు ఎంత స్వీట్‌గా ఆయన మాటలకి నవ్వాలి. కాన్‌సర్టు చేసేటప్పుడు ఎలాంటి సందర్భాల్లో ఆయనవేపు సార్థకంగా చూడాలి- అన్నీ పద్ధతిగా రిహార్స్ చేయించాడు. అది గుర్తుచేస్తూ ఆర్. ఎల్. రావుగార్ని ఎలాగయినా "కేచ్" చెయ్యాలని చెప్పడానికే ఆంజనేయులు నిన్న విజయవాడనుంచి ట్రంక్ కాల్ కూడా చేశాడు.

"హల్లో! మాల్తీ డియర్! ఎలాగైంది నిన్న ప్రోగ్రాం?" అని పలకరిస్తూ ఇంట్లో అడుగు పెట్టేడు.

"బాగా పాడాను డాడీ!"

"బాగా ఏమిటి-నాన్‌సెన్స్! అద్భుతంగా పాడుంటావు డార్లింగ్! దాంట్లో డవుటేం వుండదు. కాని ఆర్. ఎల్. రావుగారు ఎలా రియాక్టు అయ్యారు?"

ఆయనతో మాట్లాడ్డానికి అపర్చునిటీ దొరకలేదు డాడీ!"

"వాట్ ఏ పూల్ యువార్! అపర్చునిటీలు ఎక్కడన్నా దొరుకుతాయా? మనమే వాటిని సృష్టించెయ్యాలి. చెప్పాగా!" అని, పెద్ద కేక పెట్టి "జమ్నా" అని భార్యని పిలిచాడు ఆంజనేయులు.

"అది కాద్ డాడీ! వాళ్ళేమో మీటింగు ముందు పెట్టేసి. రావుగార్ని

సంగీతం గురించి స్పీచ్ యిమ్మన్నారు. ఆర్టిస్ట్ ఆఫ్ ది డే గా నన్ను డయాస్ మీదికి ఇన్ వైట్ చెయ్యలేదు. సభంతా అయిపోయాక ఇప్పుడు సంగీత కచ్చేరీ అని రొటీన్‌గా అనౌన్స్ చేసి. నిమిషంలో చేర్స్ టేబిల్ అన్నీ సైడ్స్‌కి లాగే శారు. ఆయన అడియన్స్‌లోకి నేను స్టేజి మీదికి మారిపోయాం."

"కాన్సర్ట్ అయిపోయాక ఆయన్ని కలిసి అడగవల్సింది!"

"ఆయనకి ఢిల్లీ నుంచి ఎవరో గెస్టులు వచ్చారని డిన్నర్‌కి ఎర్లీగా వెళ్ళి పోయారు డాడీ! మీరన్నట్టుగానే ఆలాపన చేస్తున్నప్పుడు, పల్లవి పాడుతున్న ప్పుడు, స్వరజాల్లో పొగడ్త వచ్చినపుడు ఆయన్నే చూస్తూ పాడాను. కాని ఆయన రాగం తానం పల్లవి అవుతూ వుండగానే వెళ్ళిపోయారు."

"ఐటమ్ మధ్యలో లేచి వెళ్ళారా? అబ్సర్డ్!"

"మధ్యలో అంటే నాట్ ఎగ్జాక్ట్లీ ఇన్ ద మిడిల్ డాడీ! రాగం తానం పల్లవి అవంగానే వెళ్ళి పోయారు."

"ఓకే, ఓకె, డోన్ట్ గెట్ డిజార్టెండ్! చేజారిన అవకాశం లోంచి కొత్త ప్రయత్నానికి ప్రాణం పోసు కోడమే ఆప్టిమిస్ట్ చెయ్యవల్సిన పని. ఆల్ రైట్! నేను స్నానం చేసి బట్టలు మార్చుకొనే లోగా ఆర్. ఎల్. రావు గారికి రింగ్ చేసి ఎపాయింట్ మెంట్ తీసుకో. మనం ఆయన దగ్గిర పడదాం యువర్ సెల్ఫ్, మమ్మీ అండ్ మిసెల్ఫ్?"

ఎదురుగా వస్తున్న భార్యని చనువుగా నడుం మీద చెయ్యేసి లాక్కొడుతూ ఆంజనేయులు "కమన్ జమ్నా-ఆయ్ హావె వర్డ్ ఫర్ యు.... ఏమిటి, మాలతి ఇంకా పెంపుడు కూతుర్లాగే బిహేవ్ చేస్తోంది? ఇంతకంటె చొరవ నేర్చుకోకపోతే మరి నువ్వెందుకు, నేనెందుకు? సిల్లీ?" అన్నాడు.

* * *

"హలో___"

"హలో___"

ఆర్. ఎల్. రావుగారున్నా రండి?"

"మాట్లాడుతున్నాను'"

"నమస్కారం సార్! నేను సింగర్ మాలతిని మాట్లాడుతున్నానండి బావున్నారా సార్?"

"థాంక్యూ."

"నిన్న సంగీత కచేరి చేసేసు కదండి-గుర్తొచ్చానసుకుంటాను?"

"అయ్యో, గుర్తు రాకేం? యు శాంగ్ క్వయిట్ వెల్?"

"థాంక్యు సర్.... ఇఫ్ యు డోంట్ మైండ్- నేను, డాడీ, మమ్మీ ఇప్పుడు మీ ఇంటికొద్దామనుకుంటున్నాము సార్! మాతో కొంతటైమ్ స్పెండ్ చెయ్యడానికి మీకు వీలుంటుందా సార్?"

"ఓ-ష్యూర్. యువర్ వెల్కమ్. వెంటనే రాకండి. నేను ఇప్పుడు బయల్దేరి చిన్మయానంద స్పీచ్ వినడానికి వెడుతున్నాను. ఒక గంట పోయాక మీరు రాగలిగితే మంచిది. విల్ ఇట్ సూట్యు?"

"సర్టెన్లీ సార్; డాడీ విల్ బి సో ఫీల్డ్. నిజానికి ఆయన ఇప్పుడే ఇల్లు చేరారు- ఐదు రోజుల టూర్ తరువాత. ఇప్పుడు ఆరూ పది నిమిషాలైంది. సరిగ్గా ఏడుంపావుకి మీ కాంపౌండ్లో వుంటాం. థాంక్యూ."

"ఓ.కె."

ఫోను పెట్టేసి ఆర్. ఎల్. రావు పెద్దమ్మాయికి చెప్పాడు."

"చూడు, ఒక గంటలో మనింటికి డీలక్స్ ఏజెన్సీస్ ప్రొప్రయిటరు ఆంజనేయులుగారు; వాళ్ళావిడ జమునాబాయిగారు; వాళ్ళమ్మాయి పాట కచేరీలు చేస్తుందే, మాలతి- వాళ్ళందరూ వస్తారుట. వాళ్ళు చాలా గొప్పవాళ్ళు మనలాంటి వాళ్ళం వాళ్ళని చూడాలంటే సభల్లోనో కార్లలోనో చూడవల్సిందే గాని అంటి దగ్గిర దొరకరు! అలాంటివాళ్ళు, తమంతట తాముగా ఫోన్ చేసి మరీ చెప్పారు, వస్తున్నామని. వాళ్ళు వచ్చేసరికి ఇల్లంతా శుభ్రంగా సర్దేసిఉంచండి. వాళ్ళకి ఆఫర్ చెయ్యడానికికాఫీలు, బిస్కెట్లు రెడీచెయ్యండి. మీ రంచరూకూడా కాస్తమరోసారి మొహాలూఅవీకడుక్కుని ప్రెజెంటబుల్గావుండండి ఏబ్రాసిగా వుండక.నేను చిన్మయానందస్పీచికి వెడుతున్నాను;సరిగా సలభైనిమిషాలుఅక్కడుండి వొచ్చేస్తాను. జాగ్రత్త! ఎక్కడా ఎమీ పొరపాటు రానివ్వకండి."

* * *

పి. అండ్. టి. కంపెనీ జనరల్ మేనేజరు బంగాళా ఊళ్ళో కల్లా పోష్ లొకాలిటీలో వుంది. బంగళాచుట్టూ రెండెకరాల ఖాళీ జాగా. అందులో నాలుగు విలాస వేదికలు. వాటి మీద లతానికుంజాలు. ఏ కాలంలో అయినాసరే రోజా కేజీన్నర పువ్వులు పూయ డానికి తగినన్ని రకరకాల పూల మొక్కలు. కొబ్బరి ఉసిరి, జీడి మామిడి, మామిడి చెట్లు. రెండు మద్దిచెట్ల మధ్య, విలాసంగా వూగ డానికి బలిష్టం విశాలం అయిన వుయ్యాల. ఇది ఇల్లా, లేకపోతే రామా

నాయుడు సినిమాలో సెట్టింగా అని ఆశ్చర్యపరిచే విధంగా వుంటుంది ఆ వాతావరణం.

ఏడుంపావుకి మెయిన్‌గేటు దగ్గిరాగి మెత్తగా హారన్ కొట్టిన కారు సెక్యూరిటీ జవానుకి పరిచయమే. డీలక్స్ ఏజెన్సీస్ ప్రొప్రయిటరు ఆంజనేయులుగార్ని, "వాళ్ళావిడ" జమునాబాయి గార్ని అతను చాలాసార్లు చూశాడు. అంచేత "అపాయింట్ మెంటుందా సార్?" అని అడక్కుండానే గేటు తెరిచే స్విచ్చి వేశాడు. కారు మెయిన్ బంగళా పోర్టికో దగ్గిర ఆగే వేళకి గుర్తొచ్చింది. అయ్యగారు ఒక్కరే వున్నారు కనా, వీళ్ళు రావడానికి పర్మిషన్ యిచ్చుంటారా అన్న సందేహం పరిగెత్తు కెళ్ళాడు గేట్ స్విచ్ వేసి. కాని అప్పటికే వాళ్ళు తిన్నగా, అయ్యగారు చదువు కుంటూ కూర్చున్న మెయిన్ హాల్లోకి వెళ్ళి పోయారు.

"ఎస్?" అని తలెత్తి చూశారు రావుగారు, పుస్తకం చదవడం ఆపి.

ముందుగా "నమస్కారం" చెప్పి నవ్వింది మాలతి ఆ నవ్వు స్వీట్‌గా, "మెలిపువస్"గా వుందని రావుగారి వెనకాల దూరంగా వున్న అద్దం చెప్పింది

"నేను సింగర్ మాలతి నండి. మా డాడీ, మమ్మీ...."

"సిడౌన్?"

అందరూ కూర్చున్నారు.

రావుగారు మళ్ళా పుస్తకం చదుకుకెంటూ వుండిపోయారు ఒక నిమిషం ఆ నిమిషం గడవ డానికిముగ్గురు అతిథులూ మొహాలు చూసుకోడం సాగించారు. రోజూ చూస్తున్న మొహాలే కావడాన్ని మరింత విసుగైంది.

పాటకి ముందు లాగ, గొంతు సర్దుకుంది మాలతి. రావుగారు చూశారు.

"నేను సింగర్ మాలతి నండి, నిన్న కాన్సర్ట్ చేశాను. మీరు చీఫ్ గెస్టుగా వచ్చారు."

"ఐనో; ఎస్. ఒకటి రెండు సార్లు లోగడ మీపాట రేడియోలో కూడ విన్నాను."

"థాంక్స్యండి." జమునాబాయి కృతజ్ఞతలు చెప్పింది.

"మా డాడీ ఆంజనేయులుగా రండి. మా మమ్మీ జమునాబాయి."

"చెప్పారుగా!"

మళ్ళీ కొన్ని సెకండ్లు నిశ్శబ్దం. తరువాత రావుగారు "ఎస్?" అని మాలతి వేపు చూశారు. "వాట్ కెనైడు ఫర్యూ?" అని ఆ చూపు అర్థం

గ్రహించి, మాలతి మరో నవ్వు, "స్వీట్‌గా" "మెలిప్లువస్‌గా" కాకపోతే కొంచెం మిస్చీవస్‌గా- నవ్వి, అడిగింది- "చిన్మయానంద స్పీచ్ కి వెళ్ళొచ్చేశారండి?"

"ఎవరు చెప్పేరు? ఆఫ్‌కోర్స్- నేను చిన్మయానంద స్పీచెస్ లైక్ చేస్తాను. ఆయన ఇవాళ ఇక్కడున్నారని తెలుసు. నిజానికి నే నిప్పుడు చదువుతున్నది కూడా ఆయన రాసిన పుస్తకమే. కాని స్పీచ్‌కి వెళ్ళి అక్కడ నైబర్స్ చేసే డిస్టర్‌బెన్స్ భరించలేను."

"మరి చిన్మయానంద స్పీచ్ కెళుతున్నానని చెప్పారేండి?" ఇంకా మిస్చీవస్‌గా నవ్వుతూ అడిగింది మాలతి,

"నేను చెప్పానా! ఎవరికి?"

"నాకే సార్! గంట కింవట మీకు ఫోన్ చేస్తే: ఏడుంపావుకి రమ్మన్నారుగా!"

రావుగారి కళ్ళు పెద్దవి, అలా తెరిచి చూడ్డంలో అవి మరింత పెద్దవై- వాట్లోంచి శక్తిపాతం అయినంత కంగారు పడ్డారు మిగిలిన ముగ్గురూనూ.

"ఐసీ! సో-మీరు ఆర్. ఎల్. రావుగారితో మాట్లాడారన్న మాట?"

"అవున్సార్? మీరే మాట్లాడారుగా?"

రావుగారు వెంటనే తేచారు. "ఆయామ్ సారీ? మీరు గంట కింవట ఆర్, ఎల్, రావుగారితో ఫోన్లో మాట్లాడారు, కాని నాతో కాదు. ఈఊళ్ళో ఇంకొక ఆర్. ఎల్. రావుగారున్నారు. వారితో చెప్పారు మీరు; ఏడుంపావుకి వారింటికి వస్తాము ని, ఆయన, ఆయన కుటుంబ సభ్యులు బహుశా మీ కోసం చూస్తూవుంటారని. నా కనిపిస్తోంది, అంచేత, మీరు దయచేసి ఆర్. ఎల్. రావుగారింటికి వెళ్ళడం మంచిది, లేకపోతే, మీ ఇంటికి వెళ్ళి, మీ రక్కడికి రావడం లేదని కనీసం ఫోన్లో అయినా చెప్పడం సమంజసం. నా కొంచెం పనుంది. మనం మరోసారి ఎప్పుడైనా, తీర్గిగా కలుద్దాం. థాంక్స్ యు రాఘవరావ్?" అని చెయ్యి గాలిలో ఆడించి, చేతిలో ఉదే పుస్తకంతో లోపలికె వెళ్ళి పోయారు. సెక్యూరిటీ జవాను ఇంక ఆలస్యం చెయ్యకుండా సలాం కొట్టాడు.

"అంతా బాగుంది, కాని, థేంక్స్ యు రాఘవరావ్ అంటా డేమిటి? వాడెవడు, మధ్యని?" అంటు లేచి, బయటికి దారితీశాడు శీలక్స్ ఏజెన్సీస్ ప్రొప్రయిటర్ ఆంజనేయులు.